# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 26-07-2024 సమయం : సాయంకాలం 6 గం. 10 ని.లు

## ముఖ్యాంశాలు

- గత ప్రభుత్వ హయాంలో జరిగిన ఆర్థిక అవకతవకలపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈరోజు శాసనసభలో శ్వేతపత్రం విడుదల చేశారు.
- దేశ సైన్యాన్ని ఆధునికీకరించడానికే "అగ్నిపథ్" పథకాన్ని తీసుకువచ్చామని ప్రధానమంత్రి నరేంద్రమోదీ స్పష్టం చేశారు.
- గోదావరి వరద బాధితులకు 3 వేల రూపాయల ఆర్థిక సాయం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రకటించారు.
- ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ సమావేశాలను నిరవధిక వాయిదా వేశారు.
- ప్రధానమంత్రి నరేంద్ర మోదీ "మన్ కీ బాత్" కార్యక్రమం 112వ సంచిక ఈ ఆదివారం ఉదయం 11 గంటలకు ప్రసారమవుతుంది.

= = = = = = = = = = = = = = = = = = = = =

గత ప్రభుత్వ హయాంలో జరిగిన ఆర్థిక అవకతవకలపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈరోజు శాసనసభలో శ్వేతపత్రం విడుదల చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ… గత ప్రభుత్వ కాలంలో ఆదాయం తగ్గి అప్పులు పెరిగాయని 9.74 లక్షల కోట్ల రూపాయల అప్పులు చేశారన్నారు. తలసరి అప్పు 1.44 లక్షల రూపాయలుగా ఉందని వెల్లడించారు. వ్యవసాయంలో వృద్ధి రేటు 5.7 శాతం, సేవల రంగంలో 2 శాతం తగ్గిందని అన్నారు. రాష్ట్రానికి వచ్చే ఆదాయం కూడా 76 వేల 195 కోట్ల రూపాయలు తగ్గిపోయిందని వివరించారు. పోలవరం పూర్తి చేస్తే ప్రతి ఎకరాకు సాగు నీరందుతుందని, 1,667 కోట్ల రూపాయలు ఖర్చు చేసి పట్టిసీమ ప్రాజెక్టు పూర్తి చేశామన్నారు. పట్టిసీమ పూర్తి చేయడం వల్ల 44 వేల కోట్ల రూపాయల ఆదాయం వచ్చిందని అన్నారు. కాని గత ప్రభుత్వ పాలనలో పట్టిసీమను కూడా సరిగా నిర్వహించలేదని స్పష్టం చేశారు. ఇచ్చిన మాట ప్రకారం ఎన్నికల హామీలను అమలు చేస్తామని ముఖ్యమంత్రి తెలియజేస్తూ….

(వాయిస్ 37 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = =

ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ కార్గిల్ 25వ విజయ దివాస్‌ను పురస్కరించుకొని లద్దాఖ్‌లో ద్రాస్ వద్ద ఉన్న యుద్ధ స్మారకాన్ని ఈరోజు సందర్శించి, అమర జవాన్లకు నివాళులర్పించారు. అ సందర్భంగా ప్రధానమంత్రి మాట్లాడుతూ.. అగ్నిపథ్ పథకంపై విపక్షాలు ప్రజలను తప్పు దోవ పట్టిస్తున్నారని అన్నారు. అగ్నిపథ్ పథకాన్ని ఆయన సమర్థిస్తూ దేశ సైన్యాన్ని ఆధునికీకరించడానికి, బలోపేతం చేయడానికి అవసరమైన సంస్కరణ అని తెలిపారు. సైన్యం అంటే 140 కోట్ల మంది భారతీయుల విశ్వాసమని, సైన్యంలో యువరక్తం ఉండేలా చూసుకోవడం, ఎల్లప్పుడూ యుద్ధానికి సిద్ధంగా ఉండేలా చూడటమే ఈ పథకం లక్ష్యమని పేర్కొన్నారు. అనంతరం షింకున్ లా టన్నెల్ ప్రాజెక్ట్ నిర్మాణ పనులను ప్రధానమంత్రి ప్రారంభించారు. దీని నిర్మాణం పూర్తయితే ప్రపంచంలోనే అత్యంత ఎత్తయిన సొరంగంగా గుర్తింపు సాధించనుంది.

= = = = = = = = = = = = = = = = = = = = =

గోదావరి వరద బాధితులను ఆదుకుంటామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. ఈరోజు శాసనసభలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ... తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, కోనసీమ, కాకినాడ, ఏలూరు జిల్లాలు వరద ప్రభావానికి గురయ్యాయని తెలిపారు. 4 వేల 317 ఎకరాల్లో వరి పంట దెబ్బతిందని 1.06 లక్షల ఎకరాల్లో వరి నాట్లు ముంపుకు గురయ్యాయన్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లాలోనూ వరద ప్రభావం ఉందని, ఇళ్లు నీట మునిగిన బాధితుల కోసం ప్రభుత్వం సహాయక శిబిరాలు ఏర్పాటు చేసిందని తెలిపారు. సహాయక శిబిరాల్లో ఉన్న వారికి 3 వేల రూపాయల చొప్పున ఆర్థిక సాయం అందిస్తామని, 25 కేజీల బియ్యం, ఒక లీటర్ పామాయిల్, కందిపప్పు, బంగాళా దుంపలు, ఉల్లిపాయలు కేజీ చొప్పున ఇస్తామని తెలియజేశారు. వ్యవసాయశాఖ, హోం శాఖ మంత్రులు క్షేత్రస్థాయికి వెళ్లి వరద బాధితుల్ని పరామర్శించాలని ఆదేశాలు జారీ చేశారు. ఢిల్లీలో నీతి ఆయోగ్ సమావేశం కారణంగా బాధితుల్ని పరామర్శించేందుకు స్వయంగా వెళ్లలేకపోతున్నానని అన్నారు. పంట నష్టాన్ని ప్రాథమికంగా అంచనా వేయాలని మంత్రులు, అధికారులను ఆదేశించామని ముఖ్యమంత్రి పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = =

ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ సమావేశాలు ఈ రోజుతో ముగిసాయి. శాసనసభ ప్రశ్నోత్తరాలతో ఈరోజు ఉదయం 9 గంటలకు ప్రారంభమయ్యింది. ఈ ప్రశ్నోత్రాల సమయం సందర్భంగా ప్రభుత్వ నిర్మాణాల్లో విశాఖపట్నంలో హుద్ హుద్ తుఫాను బాధితులకు ఇళ్ళు, దేవాదాయ భూముల పరిరక్షణ, నిత్యావసర వస్తువుల ధరలు, వార్తా పత్రికలలో ప్రకటనలు, రాష్ట్రంలో పింఛన్లు, మల్లవల్లి పారిశ్రామిక వాడ, ప్రభుత్వ ఆసుపత్రిలో సిబ్బంది అత్యవసర మందుల కొరత, గ్రామ పంచాయతీలకు 14, 15వ ఆర్థిక సంఘం నిధులు, ఆంధ్రప్రదేశ్ పెట్టుబడుల సదస్సు వంటి ప్రశ్నలను నిర్దేశించిన శాసన సభ్యులు అడగ్గా, ప్రశ్నోత్తరాలకు సంబంధిత మంత్రులు చర్చ జరిపి సమాధానాలను ఇవ్వడం జరిగింది. ఆ తరువాత ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై శ్వేత పత్రం విడుదల చేశారు. అనంతరం సభను సభాపతి చింతకాయల అయ్యన్న పాత్రుడు నిరవధిక వాయిదా వేశారు.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = =

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్ - మనసులోని మాట" కార్యక్రమం 112వ సంచిక ఈ ఆదివారం ఉదయం 11 గంటలకు ప్రసారమవుతుంది. ఈ కార్యక్రమం ఆకాశవాణి, దూరదర్శన్ నెట్ వర్క్‌లు, ఏఐఆర్ న్యూస్ వెబ్ సైట్ ద్వారా న్యూస్ ఆన్ ఎయిర్ మొబైల్ యాప్‌లో ప్రసారం కానుంది. మన్ కీ బాత్ హిందీ ప్రసంగం ప్రసారమైన వెంటనే అన్ని ఆకాశవాణి ప్రాంతీయ భాషల్లో దీని అనువాదం ప్రసారం అవుతుంది.

= = = = = = = = = = = = = = = = = = = = =

దేశంలో భారీ వర్షాల కారణంగా పలు ప్రాంతాల్లో వరదలు సంభవిస్తుండటంతో కేంద్ర వరద నియంత్రణ సంస్థ కొన్ని ప్రాంతాలకు ప్రమాద హెచ్చరికలు జారీ చేసింది. ప్రమాదకర స్థాయి నుండి అతి ప్రమాధకర స్థాయి మధ్యలో ఉన్నప్పుడు ఆరెంజ్ అలర్ట్ జారీ చేస్తుంటారు. అందులో భాగంగానే ఆంధ్రప్రదేశ్ లోని అల్లూరి సీతారామరాజు జిల్లా కూనవరం వద్ద గోదావరి నది ఉధృతంగా ప్రవహిస్తుండటంతో ఆరెంజ్ అలర్ట్ జారీ చేశారు. ప్రస్తుతం కూనవరం వద్ద ఈరోజు ఉదయం 6 గంటల సమయానికి 40.32 మీటర్ల స్థాయిలో వరద నీరు ప్రవహిస్తోంది.

= = = = = = = = = = = = = = = = = = = = =

దేశంలో సికిల్ సెల్ వ్యాధిని నిర్మూలించేందుకు వచ్చే సంవత్సరం నాటికి 40 ఏళ్లలోపు 7 కోట్ల మందికి పరీక్షలు నిర్వహించేలా ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ సహాయ మంత్రి ప్రతాప్‌రావు జాదవ్ పేర్కొన్నారు. ఈరోజు ఆయన రాజ్యసభలో లిఖితపూర్వక సమాధానం ఇస్తూ... కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో ప్రభావితమైన 278 గిరిజన ప్రాంతాలలో 2025-26 వరకు 7 కోట్ల మంది ప్రజలకు స్క్రీనింగ్ తో పాటు కౌన్సెలింగ్ నిర్వహించబడుతుందని తెలిపారు.

= = = = = = = = = = = = = = = = = = = = =

మహిళల టీ-20 ఆసియాకప్ సెమీఫైనల్ క్రికెట్ మ్యాచ్ లో భారత జట్టు బంగ్లాదేశ్ పై 10 వికెట్ల తేడాతో విజయం సాధించింది. ప్రత్యర్థి బంగ్లాదేశ్ జట్టు నిర్దేశించిన 81 పరుగుల స్వల్ప లక్ష్యాన్ని భారత మహిళల జట్టు 11 ఓవర్లలోనే ఛేదించి 28వ తేదీన జరిగే ఫైనల్ మ్యాచ్ కు అర్హత సాధించింది. మరో వైపు శ్రీలంక, పాకిస్థాన్ జట్ల మధ్య జరుగుతున్న రెండవ సెమీఫైనల్ మ్యాచ్ లో విజయం సాధించిన జట్టు ఆసియా కప్ ఫైనల్ మ్యాచ్ భారత్ తో ఆడనుంది.

= = = = = = = = = = = = = = = = = = = = =

అన్నమయ్య జిల్లా మదనపల్లె సబ్‌కలెక్టర్ కార్యాలయంలో రెవెన్యూ దస్త్రాలు దహనమైన ఘటనపై విచారణ కొనసాగుతోందని రెవెన్యూశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్పీ సిసోడియా తెలిపారు. ఈరోజు కలెక్టర్ కార్యాలయాన్ని సందర్శించిన ఆయన... అధికారులతో సమావేశమై రెవెన్యూ శాఖ రికార్డులపై పలు సూచనలు చేశారు. అనంతరం పాత్రికేయులతో మాట్లాడుతూ... మదనపల్లె ఘటనపై 4 బృందాలు విచారణ చేస్తున్నాయని, ఫోరెన్సిక్ నివేదిక రాగానే అన్ని నిజాలు తెలుస్తాయన్నారు. త్వరలోనే కొంతమంది ఉద్యోగులపై శాఖా పరమైన చర్యలు తీసుకుంటామని, మరికొందరిని అరెస్ట్ చేసే అవకాశముందన్నారు. మంటల్లో దగ్ధమైన రికార్డుల రికవరీకి ప్రయత్నం చేయొచ్చని సిసోడియా వివరించారు.

= = = = = = = = = = = = = = = = = = = = =

గోదావరిలో వరద ప్రవాహం కొనసాగుతోంది. ధవళేశ్వరం బ్యారేజీ వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక కొనసాగుతుంది. బ్యారేజి నుండి 12.60 లక్షల క్యూసెక్కుల మేర వరద నీటిని అధికారులు దిగువకు వదులుతున్నారు. దీంతో దిగువనున్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలోని లంక గ్రామాలు ఈ రోజుకీ జలదిగ్బంధనంలోనే కొనసాగుతున్నాయి. జిల్లాలోని 1,596 హెక్టార్లలోని ఉద్యాన వన పంటలతో పాటు 3 వేల 453 ఎకరాల్లోని వరిపంట దెబ్బతింది. కోనసీమ జిల్లాలోని 12 మండలాల పరిధిలో 34 గ్రామాలు వరద నీటిలో చిక్కుకున్నాయి.

= = = = = = = = = = = = = = = = = = = = =
= = = = = = = = = = = = = = = = = = = = =